# ప్రశంస

యుగయుగాలనుండి, తరతరాలనుండి కోటానుకోట్ల కంఠాలతో కీర్తించబడిన భారతీయ సంస్కృతి, అందులోని వేదప్రమాణము కాలప్రభావముచేత మానవుని మనః ప్రభావముచేత దినదినము తరిగిపోవుచున్నది.

ఈనాడు వేద, వేదాంత శాస్త్రార్థములను చక్కగా సామాన్యప్రజలకు అర్థమగునట్లు బోధించు వ్యక్తులు కరువైపోయినారు. ఈనాడు వేదములను సముద్ధరించలేకపోయినయెడల భవిష్యత్తులో భారతదేశస్థితిగతులు ఏ విధముగా మారునో కదా! వేద ప్రమాణములు నశించిన, భారతీయ కీర్తియే నశించిపోవును. భారతీయుల ప్రాణము, ప్రమాణము వేదములపైనే ఆధారపడియున్నవి. కనుక, తిరిగి వేదములను పునరుద్ధరించు నిమిత్తము సత్యసాయి సంస్థలు అనేక విధములైన ప్రయత్నములకు సంసిద్ధమై యున్నవి.

ఘండికోట సుబ్రహ్మణ్యశాస్త్రి శతవర్షములు జీవించిన వేదపండు. వేద, వేదాంగ, వేదార్థములను గుర్తించిన మహాపండితుడు. విజయనగర సంస్థానమందు తన పాండిత్యమును ప్రకటించి గొప్ప కీర్తి సాధించినవాడు. ఆంధ్రదేశములో సాటిలేని మేటి. అతడు కేవలము వేద ప్రమాణములతోనే కాక, భక్తి ప్రపత్తులయందుకూడ తన జీవితమును పూర్ణము గావించిన వ్యక్తి. అతనికి స్వామిపై మక్కువ ఎక్కువ. అతని విశ్వాసమెట్టిదనగా, సర్వవేదసారమును గుర్తించి తన అంత్యజీవితమును స్వామి సన్నిధియందే గడపుతూ వచ్చాడు. ప్రశాంతినిలయములో శతవర్షములు నింపుకున్నాడు.

అతని జ్ఞాపకార్థం వేద, శాస్త్ర అభివృద్ధి నిమిత్తమై 'శ్రీసత్యసాయి ఘండికోట సుబ్రహ్మణ్యశాస్త్రి వేద శాస్త్ర పరిషద్'ను నేడు ప్రారంభించుచున్నాను.

అతడు ఎంతకాలమైనప్పటికి అమరుడనే చెప్పవచ్చును. అనంతమైన, అమృతమైన

sri sathyasai vachanamrutam

హృదయము కలవాడు కనుక అమరత్వానికతనికి అధికారమున్నది. అందుచే అతని ఆదర్శములను, సద్గుణములను వేదార్థములను విరివిగా చాటవలయును. వేద ప్రమాణములను ప్రధాన ఆధారముగా భారతీయులు అనుసరించి, వేద సంస్కృతిని పునరుద్ధరింపజేసిన, తిరిగి మన భారతదేశము ప్రాచీన వైభవముతో రూపొందునని ఆశిస్తూ, ఆశీర్వదిస్తున్నాను.

**(తేదీ 11-10-1986న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారిచే ఘండికోట సుబ్రహ్మణ్యశాస్త్రిగారి ప్రశంస)**

sri sathyasai vachanamrutam